RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAI మాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ బుధవారం 14-02-2024 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 06 సంచిక : 41 పేజీలు : 4 వెల : రూ 2-00







## అనారోగ్యంతో డిప్యూటీ సీఎం భట్టి సోదరుడు మృతి

హైదరాబాద్,ఫిబ్రవరి13(): తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆయన సోదరుడు మల్లు వెంకటేశ్వర్లు అనారోగ్యంతో కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. హోమియో ఎండీ చదివిన మల్లు వెంకటేశ్వర్లు.. ఆయుష్ శాఖలో ప్రొఫెసర్ గా, అడిషినల్ డైరెక్టర్ గా పనిచేసి రిటైర్ అయ్యారు. వైరా 1వ వార్డులో ఉన్న తన నివాసంలోనే హోమియో ఆస్పత్రిని నిర్వహిస్తూ.. ప్రజలకు వైద్యం అందిస్తూ వచ్చారు. మల్లు వెంకటేశ్వర్లుకు హోమియో వైద్యంలో మంచి పేరుంది. అతని వద్ద వైద్యం చేయించుకునేందుకు రాష్ట్రంలో మిగతా ప్రాంతాల నుంచీ రోగులు వచ్చేవారు.మూడు మరింత క్షీణించడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఇటీవల హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చేర్చారు.

# కేసీఆర్ కు నేను విజ్ఞప్తి చేస్తున్నా

### మేడిగడ్డ అద్భుతాలను వివరించండి
### అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్ ,తెలంగాణ సస్యశ్యామలం చేసేందుకు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి ఆనాటి ప్రభుత్వం, రూ.38,500 కోట్లతో 2008 లో టెండర్లు పిలిచింది. వెంకటస్వామి సూచనతో ప్రాణహితకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టారు. రీడిజైన్ పేరుతో బీఆరెస్ ప్రభుత్వం ప్రాజెక్టు డిజైన్ మార్చి అంచనాలు పెంచింది. రూ.1లక్ష 47 వేల కోట్లకు అంచనాలు పెంచారు. ఇసుక కదిలితే బ్యారేజ్ కూలింది అని వాళ్లు చెబుతున్నారు. వాళ్లు ఇసుకలో పేక మేడలు కట్టారా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఇండియా పాకిస్తాన్ బార్డర్ లా ప్రాజెక్టు వద్ద పహారా పెట్టారు. ఎవరినీ చూడకుండా అడ్డుకున్నారని అన్నారు.కొంత మంది అధికారులు ఫైళ్ళు మాయంచేసినట్లు మీడియాలో కథనాలు వచ్చాయి. దీంతో మా ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేపట్టింది. విజిలెన్స్ విచారణ చేపట్టి పూర్తి నివేదిక ఇచ్చింది. అక్కడ ఏం జరిగిందో తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతీ శాసనసభ సభ్యుడిపై ఉంది. సభలో విజిలెన్స్ నివేదికపై చర్చ చేపట్టాల్సిన అవసరం ఉంది.అందుకే మనమంతా మేడిగడ్డ బ్యారేజీని విజిట్ చేద్దామని అన్నారు.కేసీఆర్ కు నేను విజ్ఞప్తి చేస్తున్నా.

మీరు, మీ శాసన సభ్యులు మేడిగడ్డకు రండి.. మీరు ఆవిష్కరించిన అద్భుతాలను దగ్గరుండి వివరించండని అన్నారు.మీ అనుభవాలను అక్కడ అందరికీ వివరించి చెప్పండి. తాజ్ మహల్ లాంటి ఆ అద్భుతాన్ని ఎలా సృష్టించారో అందరికీ చెప్పండి. జరిగిన వాస్తవాలు తెలంగాణ ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందా? లేదా? తప్పు జరిగిందా లేదా? జరిగితే కారణం ఎవరు?.. శిక్ష ఏమిటి..? కాళేశ్వర్ రావు అని గతంలో ఆయన్ను ఆనాటి గవర్నర్ సంభోదించారు. కాళేశ్వర్ రావు ని అక్కడికి రావాల్సిందిగా కోరుతున్నా. మీకు బస్సుల్లో రావడం ఇబ్బంది అనుకుంటే... హెలికాప్టర్ కూడా సిద్ధంగా ఉంది. రేపో ఎల్లుండో సాగునీటి ప్రాజెక్టులపై మంత్రి శ్వేతపత్రం విడుదల చేస్తారు. కాళేశ్వరం కథేంటో సభలో తెలుద్దామని అన్నారు. .

# 'పీఎం సూర్య ఘర్' పథకాన్ని ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ..



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13 ప్రధాని నరేంద్ర మోదీ కొత్తగా ఉచిత విద్యుత్ పథకం పీఎం సూర్య ఘర్ : బిజ్లీ ముఫ్త్ యోజన కొత్త పథకాన్ని ప్రకటించారు. ఈ విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ (ట్విట్టర్) ద్వారా వెల్లడించారు. మరింత స్థిరమైన అభివృద్ధి, ప్రజా శ్రేయస్సు కోసం పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పథకం ద్వారా ప్రజలకు ప్రతినెలా 300 యూనిట్ల వరకు ఉచిత విద్యనందించేందుకు కేంద్రం ఇటీవల బడ్జెట్‌లో పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. రూ.75వేలకోట్ల పెట్టుబడితో ప్రాజెక్ట్ ద్వారా ప్రతి నెలా 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించడం ద్వారా కోటి ఇండ్లలో వెలుగులు నింపాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.పథకం కింద అందించే సబ్సిడీలను నేరుగా ప్రజల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు చెప్పారు. రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థ ఏర్పాటుకు సబ్సిడీ నుంచి రాయితీతో కూడిన బ్యాంకుల రుణాలు పొందవచ్చని.. వీటితో ప్రజలపై ఎలాంటి వ్యయభారంపడకుండా కేంద్రం భరోసా ఇస్తుందన్నారు. స్టేక్ హోల్డర్లందరూ జాతీయ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఏకీకృతం చేయబడతారని, ఇది సౌలభ్యాన్ని మరింత మెరుగుపరుస్తుందన్నారు. పథకానికి క్షేత్రస్థాయిలో ప్రచారం కల్పించేందుకు పట్టణ స్థానిక సంస్థలకు, పంచాయతీలకు అందించనున్నట్లు పేర్కొన్నారు. పట్టణాలు, పంచాయతీలు తమ పరిధిలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారుఈ పథకంతో విద్యుత్ బిల్లులు తక్కువ రావడంతో పాటు ఉపాధి కల్పన జరుగుతుందని తెలిపారు. 'సౌరశక్తిని, స్థిరమైన అభివృద్ధిని మరింత విస్తృతం చేద్దాం' మంటూ పిలుపునిచ్చారు. గృహ వినియోగదారులు, ముఖ్యంగా యువత ఈ 'సూర్య ఘర్' పథకాన్ని బలోపేతం చేయాలని కోరారు. ఇందుకోసం జూఎబబీతీఎజీణష్ట్రజీతీ.ణనీల.తినిలో దరఖాస్తు చేస్తు చేసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. ఇటీవల బడ్జెట్‌లో నిర్మలా సీతారామన్ పథకాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా నేపథ్యంలో చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రూఫ్‌టాప్ సిస్టమ్ బిగింపు ద్వారా ప్రతి కుటుంబానికి ఏటా 15వేల నుంచి 18వేల వరకు ఆదా అవుతుందని, వినియోగించుకోగా విద్యుత్ మిగిలితే.. పంపిణీ సంస్థలకు విక్రయించుకోవచ్చని బడ్జెట్ ప్రసంగంలో కేంద్రం మంత్రి పేర్కొన్నారు.

## కనీస మద్దతు ధరకు చట్టబద్ధత : రాహుల్ గాంధీ హామీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13 డిమాండ్ల సాధనకు రైతులు ఛలో ఢిల్లీ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కీలక హామీ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ గెలుపొంది పాలనా పగ్గాలు చేపడితే రైతులందరికీ తమ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కల్పిస్తూ చట్టపరమైన భద్రత కల్పిస్తామని రాహుల్ భరోసా ఇచ్చారు. స్వామినాథన్ కమిషన్ సూచనల ప్రకారం ఎంఎస్‌పీకి చట్టబద్దత కల్పిస్తామని ప్రకటించారు.ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించడం చారిత్రక నిర్ణయమని 15 కోట్ల మంది రైతుల జీవితాలను ఇది మార్చేస్తుందని, వారి సౌభాగ్యానికి దారితీస్తుందని రాహుల్ పేర్కొన్నారు. న్యాయం చేసే దిశగా ఇది కాంగ్రెస్ తొలి గ్యారంటీ అని ఆయన వివరించారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా రాహుల్ ఈ హామీ ఇచ్చారు.కాగా, పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ రైతులు చేపట్టిన 'ఛలో ఢిల్లీ' కార్యక్రమం ఉద్రిక్తతలకు దారి తీసింది. 'ఛలో ఢిల్లీ' కార్యక్రమంలో భాగంగా పంజాబ్-హర్యానా సరిహద్దుల్లోని శంభు బార్డర్‌కు రైతులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. ముందుగా పోలీసులు వచ్చినవాళ్లను వచ్చినట్టే అరెస్ట్ చేసి స్టేషన్‌లకు తరలించారు.కానీ, కాసేపటికే రైతుల సంఖ్య పెద్ద ఎత్తున పెరగడంతో అరెస్టులు సాధ్యం కాలేదు. వారిని చెదరగొట్టేందుకు టియర్ గ్యాస్ ప్రయోగించారు. దాంతో ఆందోళనకారులు తలోదిక్కు పరుగులు తీశారు. అక్కడి పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా మారింది.

## ఈ రెండు పార్టీలవి జిమ్మికులు: కిషన్ రెడ్డి

హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్, బిఆర్ఎస్‌కు ఓటేస్తే మూసీనదిలో వేసినట్టేనని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ పార్లమెంట్ సీటును తాము గెలుస్తామని జోస్యం చెప్పారు. దేశంలో బలమైన నాయకత్వం బిజెపికే ఉందని, కాంగ్రెస్, బిఆర్ఎస్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా గెలుపు బిజెపిదేనని స్పష్టం చేశారు. లోక్ సభ ఎన్నికలలో తెలంగాణలో బిజెపి ఎక్కువ సీట్లు గెలుస్తుందని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో పార్లమెంట్ ఎన్నికలలో విజయం సాధించి మూడో సారి ముచ్చటగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని కిషన్ రెడ్డి జోస్యం చెప్పారు.



# సుదీర్ఘ నిరసనకు సిద్ధమైన రైతులు


### ఆరు నెలలకు సరిపడా నిత్యావసరాల సమకూర్పు
### ఢిల్లీలో భారీ నిరసనకు అన్నదాత సన్నద్ధం
### శంభు సరిహద్దు వద్ద ఉద్రిక్తత
### రైతులపై బాష్పవాయువు ప్రయోగం
### రాజధాని సరిహద్దుల్లో భారీ ట్రాఫిక్‌జామ్



న్యూఢిల్లీ,ఫిబ్రవరి13 : తమ డిమాండ్లను నెరవేర్చుకునే లక్ష్యంతో మంగళవారం దేశ రాజధాని దిల్లీ దిశగా అన్నదాతలు కదిలారు. ఈ ఉదయం పంజాబ్, హరియాణా నుంచి వేలాదిమంది రైతులు ట్రాక్టర్లతో నగరానికి బయల్దేరారు. ఈ క్రమంలో కొన్ని కీలక విషయాలు వెల్లడయ్యాయి. ఇటీవల వెలుగులోకి వచ్చిన నిఘా నివేదిక ప్రకారం.. ఒక్క పంజాబ్నుంచే వందల సంఖ్యలో ట్రాక్టర్లు, వాహనాలు బయల్దేరతాయని, వాటిలో అన్నదాతలు ఆరు నెలలకు సరిపడా ఆహారం, ఇతర సామగ్రిని తీసుకువస్తారని తెలిపింది. కొందరు రైతులు మీడియాతో మాట్లాడుతూ ఇదే విషయాన్ని వెల్లడించారు. ప్రభుత్వం, పోలీసులు తమ సహనానికి పరీక్ష పెట్టినా డిమాండ్లు నెరవేరేవరకు నిరసన కొనసాగిస్తామన్నారు. 'సుత్తి, రాళ్లను పగలకొట్టే పరికరాలతో సహా కావాల్సినవన్నీ మా ట్రాలీల్లో ఉన్నాయి. ఆరు నెలలకు సరిపడా రేషన్, డీజిల్‌తో మేం మా ప్రాంతాల నుంచి బయలుదేరాం' అని ఓ రైతు మీడియాకు వెల్లడించారు. ఆయన రెండు ట్రాలీల్లో సామగ్రిని తీసుకొని పంజాబ్‌లోని గురుదాస్‌పుర్ నుంచి దేశ రాజధానికి వస్తున్నారు. తమ యాత్రను భగ్నం చేసేందుకు ట్రాక్టర్లకు డీజిల్ దొరక్కుండా చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపించారు.2020-21లో ఉద్యమించిన రైతులు పలువురు ప్రస్తుత ఆందోళనలో పాల్గొంటున్నారు. అప్పట్లో వారు కొన్ని నెలల పాటు దిల్లీలో చలిని లెక్క చేయకుండా నిరసన చేపట్టారు. హామీ ఇచ్చినట్టుగా కేంద్రం తమ డిమాండ్లను నెరవేర్చలేదని, ఇప్పుడు వాటిని సాధించుకున్నాకే తిరిగి వెనక్కివెళతామని వారు స్పష్టంచేశారు. కాగా రైతులు తలపెట్టిన మెగా మార్చ్‌లో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. పంజాబ్, హరియాణా మధ్య ఉన్న శంభు సరిహద్దు వద్దకు భారీ సంఖ్యలో వచ్చిన రైతులపై పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారు. దిల్లీ దిశగా కదులుతున్న వారిని అడ్డుకునేందుకు ఈ చర్యలు తీసుకున్నారు. దీంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. బాష్పవాయువు ప్రయోగంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. అలాగే బలగాలు డ్రోన్లతో స్మోక్ బాంబ్స్‌ను జారవిడిచారు. దీంతో నిరసనకారులు, మీడియా ప్రతినిధులు పరుగులుపెట్టినట్లు తెలుస్తోంది. ఆందోళనకారులు వారి ప్రణాళిక ప్రకారం 'దిల్లీ చలో' మార్చ్‌ను ప్రారంభించారు. ఈ క్రమంలోనే పంజాబ్-హరియాణా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన బారికేడ్లను వారు బద్దలుకొట్టేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు వారిని అడ్డుకునేందుకు టియర్‌గ్యాస్ ప్రయోగించినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

# మేడిగడ్డ పిల్లర్లు కుంగితే ఇష్యూ చేస్తున్రు: హరీష్ రావు

రాజకీయలబ్ధి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ సందర్శన చేపట్టిందని ఎమ్మెల్యే హరీష్ రావు మండిపడ్డారు. మేడిగడ్డలో తప్పు జరిగితే చర్యలు తీసుకోండి.. ప్రాజెక్టును పునరుద్ధరించడని అన్నారు. మంగళవారం అసెంబ్లీలో మీడియా పాయింట్ వద్ద హరీష్ రావు మాట్లాడుతూ.. ప్రతిపక్షాన్ని మాట్లాడనివ్వకుండా..శాసనసభలో సభా సంప్రదాయాలను ఉల్లంఘించారని విమర్శించారు. బ్యారేజీ పిల్లర్లు కుంగితే ఇష్యూ చేస్తున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ రావు ఫైర్ అయ్యారు.కాళేశ్వరం అంటే మేడిగడ్డ ఒక్కటే కాదన్నారు. కాళేశ్వరం అంటే.. 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 19 సబ్ స్టేషన్లు, 21 పంప్ హౌజులు, 203 కిలోమీటర్ల సొరంగాలు, 1531 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్, 98 కిలోమీటర్ల ప్రెజర్ మెయిన్స్, 141 టిఎంసీల స్టోరేజ్ కెపాసిటీ, 530 మీటర్ల ఎత్తుకు లిఫ్ట్.. వీటన్నింటి సమాహారం కాళేశ్వరమని చెప్పారు.





## కాళేశ్వరం ప్రాజెక్టు అంటే ఒక ఆట బొమ్మ కాదు : కేసీఆర్

నల్లగొండ : ఉత్తర తెలంగాణ వర ప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టు పట్ల విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిప్పులు చెరిగారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే ఒక ఆటబొమ్మ కాదు.. అవగాహన చేసుకొని మాట్లాడాలి అని కేసీఆర్ పేర్కొన్నారు. చలో నల్లగొండ సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు.చలో నల్లగొండ సభ నుంచి ఈ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నా. ఇవాళ గోదావరికి ప్రధానమైన ఉపనది ప్రాణహిత. ఇవాళ కూడా 5 వేల క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. అవి ఎత్తిపోయాలి. ఎల్ఎండీ, ఎంఎండీ నింపాలి. రైతులకు నీళ్లు ఇవ్వాలి. కానీ ఏం జేస్తుండ్రు.. మేడిగడ్డ పోతాం. బూరుగుగడ్డ పోతాం. బొందలగడ్డ పోతాం.. ఏం తొకమట్ట ఉన్నాది మేడిగడ్డ వద్ద.. బిడ్డ ఈ స్టేజీ మీద ఉన్న నాయకులంతా అసెంబ్లీ అయిపోయాక మేం కూడా అక్కడికి పోతాం.. మీ బండారం బయటపెడుతాం. మీ చరిత్ర మొత్తం ఎండగడుతాం. ఓ లంగచాత పెట్టి పోయిన ప్రభుత్వాన్ని బద్నాం చేయాలి.. బట్టకాల్చి మీద వేయాలని చెప్పి మేం మేడిగడ్డ పోతాం అంటరు. మేడిగడ్డకు పోయి ఏం పీకుతరు.. ఎందుకు పోతున్నావు మేడిగడ్డకు. దమ్ముంటే నీళ్లు ఎత్తిపోయి.. నీళ్లు ఉన్నాయి.. కాపర్ డ్యాం పెట్టి కూడా నీళ్లు ఎత్తిపోయొచ్చు. కేసీఆర్‌ను బద్నాం చేయాలనే దుష్టబుద్ధి పెట్టుకుని రైతుల పొలాలు ఎండబెడుతారా.. మహబూబాబాద్, డోర్నకల్, సూర్యాపేట, తుంగతుర్తికి నీళ్లు వస్తలేవు. తగ్గిపోతున్నాయి. ఇదా మీ రాజకీయం.. చిల్లర రాజకీయం అని కేసీఆర్ ధ్వజమెత్తారు.

నాగార్జున సాగర్‌లో కుంగిపోలేదా..? కడెం గేట్లు కొట్టుకుపోలేదా..?

మేడిగడ్డ వద్ద 250 నుంచి 300 పిల్లర్లు ఉంటాయి. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే ఒక ఆట బొమ్మ కాదు. గోదావరి మీద మూడు బ్యారేజీలు ఉంటాయి. 200 కిలోమీటర్ల టన్నెల్స్ ఉంటాయి. 1500 కి.మీ. కాల్వ ఉంటది. 19 సబ్‌స్టేషన్లు, 20 రిజర్వాయర్లు ఉంటాయి. ఇదంతా కాళేశ్వరం ప్రాజెక్టు కాదట. ఒక రెండు మూడు పిల్లర్లు కుంగిపోయాయి. ఎన్నిసార్లు కుంగిపోలేదు. సాగర్‌లో కుంగిపోలేదా..? కడెం ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోలేదా..? మొన్నటి దాకా మూసీ ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోలేదా..? ఏదన్నపోతే సర్దాలి.. మంచిగా చేయాలి. తొందర రైతులకు నీళ్లు ఇవ్వాలి. మేం మేడిగడ్డం పోతాం.. బొందలగడ్డ పోతాం ఇది రాజకీయమా.. ఇది తెలివా..? ఇది కాదు రాష్ట్ర ప్రజలకు కావాల్సింది అని కేసీఆర్ సూచించారు.



# సంపాదకీయం

బుధవారం 14-02-2024

## కృష్ణ జన్మభూమిపైనే అందరి దృష్టి

500 ఏళ్లుగా వివాదాలు, సవాళ్లు, న్యాయపరమైన చిక్కులు, సమస్యలు అన్నీ దాటుకుని వచ్చి అయోధ్య రామ మందిర నిర్మాణం పూర్తైంది. ఈ మధ్యే ప్రారంభోత్సవమూ జరిగింది. ఎన్నో ఏళ్లుగా తమ అజెండాలో ఉన్న ఈ హామీని నెరవేర్చుకుంది బీజేపీ. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ఈ కల నెరవేరిందంటూ ఇప్పటికే బీజేపీ ప్రచారం చేసుకుంటోంది. లోక్‌సభ ఎన్నికల ముందు ఆ పార్టీకి మంచి జోష్ ఇచ్చే పరిణామం ఇది. దీన్ని రాజకీయాలకు ముడి పెట్టొద్దు అని ఎంతగా చెప్పినప్పటికీ అది సాధ్య పడడం లేదు. కాంగ్రెస్ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఈ సమస్యను తమ ప్రభుత్వం పరిష్కరించిందని ఇటీవలే హోం మంత్రి అమిత్ షా కూడా లోక్‌సభలో స్పష్టం చేశారు. అయోధ్య కన్నా ముందు కాశీ విశ్వనాథుని ఆలయాన్ని పునరుద్ధరించడం వల్ల మోదీపై హిందువులకు ఎనలేని గౌరవం పెరిగింది. హిందూ ధర్మాన్ని నడిపించే వ్యక్తి అంటూ ప్రశంసలు పొందుతున్నారు. అయితే...ఎన్నో న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కొని అయోధ్య రామ మందిర నిర్మాణాన్ని చేపట్టిన మోదీ సర్కార్...అప్పుడే మరో లక్ష్యాన్ని పెట్టుకున్నట్టు తెలుస్తోంది. అదే మధుర ఆలయ నిర్మాణం. శ్రీకృష్ణ జన్మభూమిలో ఔరంగజేబు మసీదు కట్టించారని హిందువులు ఎప్పటి నుంచో వాదిస్తున్నారు. రామ జన్మభూమి వివాదం కొలిక్కి రావడం వల్ల ఇప్పుడు కృష్ణ జన్మభూమిపైనే అందరి దృష్టి నెలకొంది. దీనికి తోడు ఇటీవల ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్..శ్రీకృష్ణ జన్మభూమిలో ఆలయం కట్టాలన్న ఆకాంక్ష వ్యక్తం చేశారు. అంటే...తమ అజెండాలో అది కూడా ఉందని హింట్ ఇచ్చారు. అయితే...కృష్ణ జన్మభూమి విషయంలోనూ ఎన్నో న్యాయపరమైన సవాళ్లని దాటుకోవాల్సి ఉంటుంది. యమునా నదీ తీరంలోని మధురలోనే శ్రీకృష్ణుడు జన్మించాడనేది హిందువుల బలమైన విశ్వాసం. ఇక్కడ ఒకటో శతాబ్దంలో విష్ణు ఆలయం నిర్మించారని చరిత్రకారుడు ఎంట్‌విసిల్ వెల్లడించాడు. రెండో చంద్రగుప్తుడు..అంటే విక్రమాదిత్యుడి కాలంలో ఇక్కడ మరో భారీ ఆలయం నిర్మించారని చెప్పాడు. ఇక్కడ పురావస్తు తవ్వకాల్లో మరి కొన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. విష్ణు ఆలయాని కన్నా ముందు ఇక్కడ బౌద్ధ ఆనవాళ్లు కనిపించాయి. బౌద్ధ నిర్మాణాలను ధ్వంసం చేసి ఇక్కడ విష్ణు ఆలయం నిర్మించారని ప్రముఖ ఆర్కియాలజిస్ట్ అలెగ్జాండర్ స్పష్టం చేశాడు. బౌద్ధ నిర్మాణాలకు ఉపయోగించిన రాతితోనే ఇక్కడ ఆలయాన్ని నిర్మించారనీ చెప్పాడు. ఇక్కడ హిందువుల ఆలయాలతో పాటు బౌద్ధులు, జైనుల నిర్మాణాలూ ఉన్నట్టు చరిత్రకారులు చెబుతున్నారు. అప్పట్లో ఇక్కడ బౌద్ధమతమే విస్తృతంగా ప్రచారంలో ఉండేదన్నది కొందరి విశ్లేషణ. అయితే..11వ శతాబ్దం నుంచి భారత్‌లో ముస్లిం పాలకుల ఆక్రమణలు మొదలయ్యాయి. ఆ సమయంలోనే ఆలయాలపై దాడులు జరిగాయి. గజనీ మధురలోని ఆలయంపై దాడి చేసినట్టు చరిత్ర చెబుతోంది. 1150 సంవత్సరానికి చెందిన ఓ సంస్కృత శాసనం ఇక్కడ విష్ణు ఆలయం ఉందని చెబుతోంది. ఇప్పుడదే స్థానంలో కేశవ్ దేవ్ ఆలయముంది. ఇక్కడి విష్ణు ఆలయం మేఘాల్ని తాకుతుందా అన్న ఎత్తుగా పాలరాతితో ధగధగా మెరిసిపోయేదని ఆ శాసనంలో రాసుంది. అయితే...వరస దాడులు జరగడం వల్ల రూపు రేఖలు లేకుండా పోయాయి. ఢిల్లీ సుల్తానుల దాడులతో ధ్వంసమైంది. 1556-1605 మధ్య కాలంలో అక్బర్ పాలనలో పరిస్థితులు కాస్త మెరుగుపడ్డాయి. అక్బర్ మూడు సార్లు మధురని సందర్శించినట్టు చరిత్రకారులు చెబుతున్నారు. 1618లో అక్బర్ కొడుకు జహంగీర్ మధురలోని కత్రాలో ఆలయాన్ని నిర్మించాడు. 1659 లో ఔరంగజేబు వచ్చిన తరవాతే అసలు పతనం మొదలైంది. 1660లో అబ్దుల్ నబీ ఖాన్‌ని మధురకి గవర్నర్‌గా నియమించాడు ఔరంగజేబు. మధురలో అంతకు ముందు ఉన్న ఆలయాన్ని పడగొట్టి జామా మసీద్‌ని నిర్మించాడు. 1669లో ఔరంగజేబు సంచలన ఆదేశాలిచ్చాడు. మొఘల్ హయాంలో ఉన్న అన్ని ప్రాంతాల్లో హిందూ నిర్మాణాల్ని ధ్వంసం చేయాలని తేల్చి చెప్పాడు. ఆ క్రమంలోనే 1670లో మధురలోని కేశవ్‌దేవ్ ఆలయాన్ని ధ్వంసం చేశారు. అక్కడే షాహీ ఈద్గా నిర్మించారు. అప్పటి వరకూ ఆలయంలో పని చేసిన పూజారులను ఆగ్రాకి తీసుకెళ్లి అక్కడే సజీవ సమాధి చేసినట్టు కొందరు చెబుతారు. ఈ ఈద్గా గురించే ఇప్పుడు వివాదమంతా నడుస్తోంది. కేశవ్‌దేవ్ ఆలయాన్ని ధ్వంసం చేసి మసీదు కట్టారని, అదే కృష్ణ జన్మభూమి అని హిందువులు వాదిస్తున్నారు. శ్రీకృష్ణుడు జన్మించిన స్థలానికి సమీపంలోనే ఉన్న కత్రా కేశవ్ దేవ్ ఆలయాన్ని ధ్వంసం చేసి 13.37 ఎకరాల భూమిలో ఈద్గా నిర్మించారన్నది హిందువుల వాదన. 1803లో మధుర బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పరిధిలోకి వెళ్లిపోయింది. 1815లో ఈ భూమిని ఈస్ట్ ఇండియా కంపెనీ వేలం వేసింది. అప్పట్లో రాజా పత్నిమల్ ఓ బ్యాంకర్ ఈ భూమిని కొనుగోలు చేశాడు. ఆ తరవాత 1944లో పత్నిమల్ వారసులు ఈ భూమిని ఇండస్ట్రియలిస్ట్ జుగల్ కిశోర్ బిర్లాకి విక్రయించాయి. 1951లో బిర్లా శ్రీ జన్మ భూమి ట్రస్ట్ ని ఏర్పాటు చేశాడు. ఇక్కడ ఆలయాన్ని నిర్మించేందుకు నిధులు సేకరించాడు. 1983 నాటికి ఆలయాన్ని పూర్తి చేశాడు. ఇప్పుడు ఈద్గా షాహి మసీదు పక్కనే ఉన్న ఆలయం ఇదే. 2020లో తొలిసారి ఈ స్థల వివాదంమొదలైంది. ఆ ఏడాది సెప్టెంబర్‌లో లక్నో వాసి, అడ్వకేట్ రంజన అగ్నిహోత్రితో పాటు మరో ఆరుగురు న్యాయ పోరాటం మొదలు పెట్టారు. కేశవ్ దేవ్ ఆలయ కాంప్లెక్స్‌లో ఉన్న మసీదుని వెంటనే తొలగించాలని పిటిషన్ వేశారు. అది కృష్ణ జన్మభూమిలో భాగమే అని వాదించారు. అయితే...ఈ పిటిషన్‌ని కోర్టు కొట్టేసింది. ఆ తరవాత ఈ వివాదం జిల్లా కోర్టుకి చేరుకుంది. ఆ తరవాత ఈ న్యాయ పోరాటం కొనసాగింది. అయితే..గతేడాది డిసెంబర్ 14వ తేదీన అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పునిచ్చింది. ఇక్కడ యాఎ సర్వే జరిపేందుకు అనుమతినిచ్చింది. ఇక్కడ మసీదు ఆనవాళ్లను తొలగించి ఆ భూమిని పూర్తిగా ట్రస్ట్కి అప్పగించాలని పిటిషనర్లు డిమాండ్ చేస్తున్నారు.

# పీ.ఎం విశ్వకర్మ పథకంపై అవగాహనను పెంపొందించాలి..

### కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు..





నిజామాబాద్, ఫిబ్రవరి 13(లోకంతీరు) : సంప్రదాయ చేతి వృత్తుల వారిని, హస్తకళాకారులను అన్నివిధాలుగా ప్రోత్సహిస్తూ, వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన(పథకం) పై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతానికి చెందిన అర్హులైన ప్రతి ఒక్కరు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పీ.ఎం విశ్వకర్మ పథకంపై అవగాహన కల్పించేందుకు వీలుగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం ఎంఎస్ఎంఈ(మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్), జిల్లా పరిశ్రమల కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ముఖ్య అతిథిగా విచ్చేసి, ఈ పథకం ఉద్దేశ్యాలు, ప్రయోజనాలను వివరిస్తూ, అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆన్ లైన్లో ఎలా దరఖాస్తు చేసుకోవాలనే దానిపై అవగాహన కల్పించారు. కమ్మరులు, స్వర్ణకారులు, కమ్మరులు, వడ్రంగులు, శిల్పులు, చేతి వృత్తుల వారు, హస్తకళాకారులు వంటి 18 కేటగిరీలలో పని చేస్తున్న వారు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందవచ్చని అన్నారు. వడ్రంగులు, పడవల తయారీదారులు, కమ్మరులు, తాళాల తయారీదారులు, బంగారం/వెండి ఆభరణాల పని చేసేవారు, శిల్పులు, చర్మకారులు, తాపీ పనివారు, చీపురు తయారీదారులు, రజకులు, దుస్తులు కుట్టే దర్జీలు, చేపల వలలు తయారుచేసే వారు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా స్వయం ఉపాధి ఏర్పర్చుకోవాలనుకునే చేతివృత్తిదారులు, హస్త కళాకారులకు ఈ పథకం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న ఏ కులానికి సంబంధించిన వారైనా సరే, ఈ పథకానికి అర్హులని స్పష్టం చేశారు. పీ.ఎం విశ్వకర్మ యోజన కింద దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని ఎంపిక చేసి నైపుణ్యం మెరుగుదల కోసం 7 రోజుల నుండి 15 రోజుల వరకు శిక్షణ అందించడం జరుగుతుందని, శిక్షణ కాలంలో రోజుకు 500 రూపాయల చొప్పున స్టైఫండ్ చెల్లిస్తారని వివరించారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న ధ్రువీకరణ పత్రం, గుర్తింపు కార్డు జారీ చేయబడుతుందన్నారు. అంతేకాకుండా వృత్తి పరికరాలు సమకూర్చుకునేందుకు వీలుగా టూల్ కిట్ కోసం 15000 రూపాయల ఆర్థిక సహాయం అందిస్తారని తెలిపారు. లబ్దిదారులు నామమాత్రంగా కేవలం ఐదు శాతం వడ్డీపై రుణ సదుపాయం పొందవచ్చని కలెక్టర్ సూచించారు. విశ్వకర్మలు తయారుచేసే వస్తువులకు సరైన మార్కెటింగ్ వసతి లభించేలా ఎం.ఎస్.ఎం.ఈ కృషి చేస్తుందని అన్నారు. ఇలా అనేక ప్రయోజనాలతో కూడుకుని ఉన్న పీ.ఎం విశ్వకర్మ పథకం గురించి గ్రామగ్రామాన విస్తృత ప్రచారం నిర్వహిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరు ప్రయోజనం పొందేలా చొరవ చూపాలని సి.ఎస్.సి కేంద్రాల ఆపరేటర్లు, గ్రామ పంచాయతీల కార్యదర్శులకు కలెక్టర్ హితవు పలికారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ తేదీ నాటికి 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. అయితే, గత 5 ఏళ్లలో స్వయం ఉపాధి/వ్యాపార అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రుణాలు తీసున్న వారు ఈ పథకానికి అర్హులు కాదన్నారు. ముద్ర, స్వనిధి పథకాల లబ్ధిదారులు తమ రుణాలను చెల్లించినట్లైతే ఈ విశ్వకర్మ పథకానికి అర్హులని తెలిపారు. ఈ పథకం కుటుంబంలోని ఒకరికి మాత్రమే వర్తిస్తుందని, ప్రభుత్వ సర్వీసులో ఉన్న వ్యక్తికి/కుటుంబ సభ్యులకు ఈ పథకం వర్తించదన్నారు. ఈ సదస్సులో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సురేష్ కుమార్, ఎం.ఎస్.ఎం.ఈ అధికారి రాజేష్ యాదవ్, జిల్లా బీ.సీ సంక్షేమ శాఖ రమేష్, ఎస్.సిద్దయ్య, పంచాయతీల కార్యదర్శులు, సి.ఎస్.సి ఆపరేటర్లు, ఔత్సాహిక విశ్వకర్మలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

# గృహజ్యోతి అర్హుల లెక్క తేలుస్తున్న అధికారులు

హైదరాబాద్, ఫిబ్రవరి 13ః రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో ఒకటైన 'గృహజ్యోతి పథకం' అమలుకు చర్యలు వేగవంతం చేసింది. గృహ వినియోగదారులకు నెలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు సరఫరా చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. దీనికి అనుగుణంగా కచ్చితమైన అర్హుల లెక్కతేల్చే పనిలో పడ్డారు. ఉదాహరణకు వికారాబాద్ జిల్లానే తీసుకుంటే.. దీని పరిధిలో పరిగి, కొడంగల్, వికారాబాద్, తాండూరు నియోజకవర్గాలున్నాయి. నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్తు వాడుతున్న నివాసాలు 1.9 లక్షలు ఉన్నట్లు అధికారుల అంచనా. ఆ మేరకు ప్రభుత్వానికి జాబితా పంపించారు. మొత్తం విద్యుత్తు సర్వీసు లెక్కలతో పాటు 200 యూనిట్లలోపు విద్యుత్తును వినియోగించే గృహాల లెక్కలు సైతం తీశారు. మరింత లోతుగా పరిశీలించి వివరాలు సేకరించే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. అర్హులందరికీ ఉచిత విద్యుత్తు అందించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు.



గ్రామాలు, పట్టణాల్లో లైన్‌మెన్లు, ఏజెన్సీ బిల్లింగ్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి బిల్లింగ్, ఐఆర్ మిషన్లతో ఇంటింటికీ వెళ్లి, విద్యుత్తు మీటర్ ఎవరి పేరిట ఉందో తెలుసుకొని వివరాలను ఐఆర్ మిషన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.ఆధార్ కార్డు, పాత రేషన్ కార్డు వివరాలు నమోదు చేస్తున్నారు. రేషన్ కార్డు లేకపోతే ఆ కాలమ్‌ను వదిలేస్తున్నారు. అద్దె ఇళ్లలో ఉన్న వారి వివరాలను కూడా సేకరిస్తున్నారు. ఈ నెల 15లోగా అందరి వివరాలు పూర్తి చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. జనవరి తాలూకూ ఇళ్ల విద్యుత్తు బిల్లుల వసూళ్లకు వెళ్తున్న సిబ్బంది పనిలో పనిగా వివరాలు సేకరిస్తున్నారు. రు గ్యారంటీ పథకాల్లో భాగంగా ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు వంటి పథకాలను అమలు చేసింది. వీటితో పాటు ఇటీవలే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల్లో సైతం 200 యూనిట్ల విద్యుత్తు వినియోగానికి సంబంధించిన అంశం పొందుపర్చి వివరాలు సేకరించడంతో ఈ పథకాన్ని సైతం త్వరలో ప్రభుత్వం అమలు చేస్తుందని వినియోగదారులు భావిస్తున్నారు. మరోవైపు ఈ పథకం అమలుకు సంబంధించి మార్గదర్శకాలు ఇంకా ఖరారు కాలేదు. వాటి జారీ అనంతరమే ఉచిత విద్యుత్తు ఎవరికి వర్తిస్తుందనేది తేలుతుంది. అప్పటి వరకు వేచి చూడాల్సిందేనని అధికారులు పేర్కొంటున్నారు.

# పంజాబ్-హర్యానా బోర్డర్ లో యుద్ధ వాతావరణం

### దేశ రాజధానిలో మరోసారి కదంతొక్కిన రైతులు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి13(: దేశ రాజధానిలో రైతులు మరోసారి కదం తొక్కారు. కేంద్రం గతంలో ఇచ్చిన డిమాండ్లను నెరవేర్చాలని కోరతూ ఢిల్లీ చలోకి పిలుపునిచ్చారు. మొదట డిమాండ్ల పరిష్కారానికి రెండు దఫాలుగా చర్చలు జరిపారు. కానీ, చర్చలు విఫలం కావడంతో భారీస్థాయిలో ఆందోళన చేపట్టేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఢిల్లీ చుట్టుపక్కల రాష్ట్రాల రైతులంతా.. ఢిల్లీకి ర్యాలీగా బయల్దేరగా.. పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు.ఉదయం 10 గంటలకు పంజాబ్ లోని ఫతేగఢ్ సాహిబ్ నుంచి వేలాదిమంది రైతులు ట్రాక్టర్లతో ఢిల్లీకి బయల్దేరారు. రైతుల్ని అడ్డుకునేందుకు పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఢిల్లీ సరిహద్దుల్లో రైతుల ఆందోళనను భగ్నం చేసేందుకు అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంతో.. ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పంజాబ్, హర్యానా సరిహద్దుల్లో యుద్ధవాతావరణం కనిపిస్తోంది. రైతులను చెదరగొట్టేందుకు శంభు బోర్డర్ లో టియర్ గ్యాస్ ను ప్రయోగించారు. ఢిల్లీ అంతటా 144 సెక్షన్ అమల్లో ఉంది. ఎర్రకోట వద్ద కూడా పరిస్థితి ఉద్రిక్తంగా ఉండటంతో భారీగా భద్రతా బలగాలు చేరుకున్నాయి. ఢిల్లీకి చేరుకునే అన్ని మార్గాల్లోనూ భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కాగా.. ఢిల్లీ చలో కార్యక్రమాన్ని విరమించుకోవాలని కోరుతూ కేంద్రం రైతుసంఘాల నేతలతో చండీగఢ్ లో నిన్న చర్చలు జరిపింది. అర్ధరాత్రి వరకూ జరిగిన ఈ చర్చలు విఫలమయ్యాయి. కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అర్జున్ ముండా.. రైతుల సంఘాల నేతలతో సమాలోచనలు జరిపారు.2020-21లో రైతుల ఆందోళనలు చేసిన రైతులపై కేసుల ఉపసంహరణకు సెంట్రల్ టీం అంగీకరించింది. అప్పటి ఆందోళనల్లో మరణించిన రైతుల కుటుంబాలకు ఇంకా ఎవరికైనా పరిహారం దక్కకపోతే వారికీ పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చింది. కానీ, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని రైతు నాయకులు గట్టిగా డిమాండ్ చేశారు. ఈ విషయంలో రైతుల సంఘాల నేతలకు, కేంద్ర బృందానికి ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో.. చలో ఢిల్లీ యథాతథంగా కొనసాగుతుందని రైతు నాయకులు తేల్చి చెప్పారు. రైతుల ఆందోళనలు భగ్నం చేసేందుకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఢిల్లీ సరిహద్దుల్లో భారీగా బలగాలను మోహరించారు. దేశరాజధానిలో సోమవారం నుంచే 144 సెక్షన్ అమలులోకి వచ్చింది. నగరంలో ట్రాక్టర్లను అనుమతించేదే లేదని తేల్చి చెప్పారు. తుపాకులు, మండే స్వభావం ఉన్న పదార్థాలు, ఇటుకలు, రాళ్లు, పెట్రోల్ వంటి వాటిని ఎవరూ తీసుకుని రాకూడదని స్పష్టం చేశారు. ఇక.. లౌడ్ స్పీకర్ల వాడకంపైనా ఈ ఆంక్షలు విధించారు. ఇప్పటికే బారీ కేడ్లు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. అనుమతి లేకుండా ఎవరినీ ఢిల్లీలోకి అనుతించడం లేదు. ఢిల్లీ హర్యానా సరిహద్దులను మూసివేశారు.రహదారిపై ఇసుక సంచులు, ముళ్ల కంచెలు, కాంక్రీటు దిమ్మెలను అడ్డుగా పెట్టారు. హర్యానా పోలీసులు టియర్ గ్యాస్ మాక్ డ్రిల్‌ను కండక్ట్ చేశారు. డ్రోన్ల సాయంతో టియర్ గ్యాస్ ప్రయోగించారు. పలు ప్రాంతాల్లో డ్రోన్లతో పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే ఢిల్లీ వైపుగా వెళ్తున్న ఎక్కడిక్కడ పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. కర్ణాటక నుంచి వెళ్తున్న 100 మంది రైతులను భోపాల్‌లో రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి రైతులు పెద్ద ఎత్తున హాజరవుతున్నారని నిఘావర్గాలు అనుమానిస్తున్నారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి కనీసం 20 వేలమంది రైతులు వస్తారని అంచనా వేస్తున్నారు. ఆందోళనలు ఎలా చేపట్టాలనే దానిపై రైతుల సంఘాలు రిహార్సల్స్ కూడా నిర్వహించారు. పంజాబ్‌లో 30 సార్లు, హరియాణాలో 10 సార్లు రిహార్సల్స్ జరిగాయని నిఘా వర్గాలకు సమాచారం ఉంది. 2000 వేల ట్రాక్టర్లతో ఢిల్లీని చుట్టు ముట్టాలని రైతులు ప్లాన్ చేశారు. అయితే, ఆంక్షల సుడిగుండాన్ని దాటుకొని ఆందోళనలు కొనసాగిస్తారా? లేదా అని ఉత్కంఠ నెలకొంది.

# శివరాత్రికి వేయిస్తంభాల గుడి కల్యాణమండపం రెడీ



వరంగల్, ఫబ్రవరి 13ః హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల గుడి ఆవరణలో నిర్మిస్తున్న కల్యాణ మండపం పనులు దాదాపు కొలిక్కి వచ్చాయి. వచ్చే శివరాత్రి నాటికి మండపాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లేదా కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు సమాచారం. 2005లో ప్రాచీన కల్యాణమండపాన్ని తొలగించి పునర్నిర్మాణ పనులు ప్రారంభించారు. నిధుల విడుదలలో జాప్యం, స్థపతితో వివాదం నెలకొన్న నేపథ్యంలో ఏళ్ల తరబడి పనులు కొనసాగాయి. రెండేళ్ల కిందట కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండపాన్ని సందర్శించి తగినన్ని నిధుల విడుదలకు ఆదేశాలివ్వడంతో పనుల్లో వేగం పెరిగింది. వేయిస్తంభాల గుడికి, మండపానికి మధ్యనున్న భారీ రాతిగోడను తాజాగా కూల్చివేసి.. ఈ రెండింటినీ అనుసంధానించారు. కాకతీయుల కాలంలో శాండ్‌బాక్స్ పరిజ్ఞానంతో నిర్మించిన ఈ కట్టడాన్ని మళ్లీ అదే రీతిలో పునర్నిర్మించారు. దీన్ని తిలకించే భాగ్యం పర్యాటకులకు త్వరలో కలగనుంది. ఇంతవరకు కల్యాణమండపానికి కేంద్ర పురావస్తు శాఖ రూ.17 కోట్ల వరకు వెచ్చించింది. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మంగళవారం మండపం పనులను పరిశీలించనున్నారు.

# తెలంగాణలో నలుగురు ఐఏఎస్, 12 మంది ఐపీఎస్‌ల బదిలీ

హైదరాబాద్, ఫిబ్రవరి 13ః రాష్ట్రంలో నలుగురు ఐఏఎస్, 12 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ అదనపు కలెక్టర్ చిత్రమిశ్రాను ఐటీడీఏ ఏటునాగారం ప్రాజెక్టు అధికారిగా బదిలీ చేశారు. ఐటీడీఏ ఏటునాగారం ప్రాజెక్టు అధికారి అంకిత్‌ను నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఆదిలాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తాను ఉట్నూరు ప్రాజెక్టు అధికారిగా బదిలీ చేశారు. ఉట్నూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చేతన్ బాజ్‌పాయ్‌ను తదుపరి పోస్టింగ్‌కు సాధారణ పరిపాలన శాఖను రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఇక, రాచకొండ పోలీస్ కమిషనరేట్ సీపీగా మల్టీజోన్-2 ఐజీగా ఉన్న డా.తరుణ్‌జోషి నియమితులయ్యారు.రాచకొండ సీపీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సుదీర్‌బాబును మల్టీజోన్ -2 ఐజీగా నియమించారు. మల్టీజోన్-1 ఐజీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు కూడా అప్పగించారు.

# తెలంగాణలో బదిలీల పర్వం

### 40 మంది మున్సిపల్ కమిషనర్లకు స్థాన చలనం

హైదరాబాద్,ఫిబ్రవరి13: తెలంగాణలో అధికారుల బదిలీల పర్వం కొనసాగుతోంది. తాజాగా 40 మంది మున్సిపల్ కమిషనర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. బుధవారంలోగా బదిలీ చేసిన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ 40 మంది మున్సిపల్ కమిషనర్లు బుధవారమే కొత్త కార్యాలయంలో బాధ్యతలు తీసుకోవాలి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారుల బదీల ప్రక్రియ కొనసాగుతోంది. చాలా శాఖల్లోనూ అధికారులకు స్థానచలనం కలుగుతోంది. ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖలోకి 395 మంది ఎంపీడీవోలను సర్కార్ వేరే చోటుకి పంపింది. అలాగే ఎక్సైజ్ శాఖలోనూ భారీగా బదిలీలు జరిగాయి.మరో రెండు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ బదిలీలు జరుగుతున్నాయి. ఈసీ మార్గదర్శకాలతో ప్రభుత్వం 14 మంది ఎక్సైజ్ సూపరింటెండెంట్లకు స్థాన చలనం కల్పించింది. ఈ క్రమంలోనే తాజాగా కాంగ్రెస్ సర్కార్ 40 మంది మున్సిపల్ కమిషర్లను బదిలీ చేసింది.రానున్న రోజుల్లో మరికొన్ని శాఖల్లోనూ అధికారులకు స్థానచలనం జరిగే అవకాశాలున్నాయి. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు ఎన్నికల విధులకు అనుబంధంగా ఉండే శాఖల్లోకి అధికారులను బదిలీ చేసే అవకాశం ఉంది. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ వస్తుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో బదిలీల ప్రక్రియను మరింత వేగవంతం చేశారు.

# అంచనా 2వేల 472కోట్లు..

### ఖర్చు 4వేల 32[1]కోట్లు

### మేడిగడ్డపై విజిలెన్స్ రిపోర్టులో సంచలన విషయాలు!!

### 133.67 శాతం అంచనాలు పెంచిన గత ప్రభుత్వం

హైదరాబాద్,ఫిబ్రవరి13(: మేడిగడ్డ బ్యారేజ్‌కు సంబంధించి సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తెలంగాణ సర్కార్ విజిలెన్స్ విచారణ చేపట్టడంతో అనేక అక్రమాలు బయటపడ్డాయి. కేసీఆర్ సర్కార్ భారీగా అంచనాలను పెంచేసినట్టు విజిలెన్స్ విచారణలో తేలింది. మేడిగడ్డ ప్రాజెక్టు మొదట అంచనా రూ. 2 వేల 472 కోట్లు. ఏకంగా 133.67 శాతం అంచనాలు గత ప్రభుత్వం పెంచేసింది. 4 వేల 321 కోట్లు ఖర్చు చేసింది కేసీఆర్ సర్కార్. ఈ విషయాలను ఆధారాలతో సహా విజిలెన్స్ బయటపెట్టింది.డ్యామ్ కుంగిపోవడానికి గల అనేక కారణాలు, అనుమానాలను తెరపైకి తీసుకొచ్చింది విజిలెన్స్. డ్యామ్ నిర్మాణం పూర్తయ్యాక కాఫర్ డ్యామ్, షీట్ పైల్స్‌ను తొలగించలేదు. అందువల్లే పియర్స్ కుంగి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తం చేసింది. నదీ సహజ ప్రవాహంపై కాఫర్ డ్యామ్ ప్రభావం పడిందని తేల్చింది. డిజైన్‌లో ఉన్నట్లుగా కటాఫ్ వాల్స్‌కు, రాఫ్ట్ వాల్స్‌కు మధ్య నిర్మాణం జరగలేదని విజిలెన్స్ విచారణలో తేలింది. అసలు నిర్మాణమే పూర్తి కాకపోయినా 2019న సెప్టెంబర్ 10న సర్టిఫికెట్ జారీ చేసింది. పనులు పూర్తికాకుండానే 2021 మార్చి 15న ఏజెన్సీకి పనులు పూర్తైనట్లు సర్టిఫికెట్ ఇచ్చేసింది అప్పటి గులాబీ సర్కార్. ఇంజనీర్ ఇన్ ఛార్జ్ ఇచ్చిన నోటీసును కూడా పట్టించుకోకుండా రూ. 159 కోట్ల సెక్యూరిటీస్ కూడా విడుదల చేసింది. అనేక నిర్మాణాలకు ఉన్నతాధికారుల అనుమతే లేనట్టు తేల్చింది. 2019 జూన్ 19న బ్యారేజ్ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకూ ఏ ఏజెన్సీ గానీ, నీటిపారుదల శాఖ గాని ఎలాంటి తనిఖీలు మేడిగడ్డ బ్యారేజ్ నిర్వహణ అస్తవ్యస్థంగా ఉందని తెలిపింది.

## ప్రత్యేక అధికారిని సన్మానించిన ఎం.ఏ హకీమ్



బాన్సువాడ/కోటగిరి లోకం తీరు:-ఇటీవల సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. ఇందులో భాగంగా ఉమ్మడి కోటగిరి మండలం ఎంఈఓ నాగనాథ్ పోతంగల్ మండల జల్లాపల్లి ఫారం గ్రామ పంచా యతీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ప్రత్యేక అధికారిని గ్రామపంచాయతీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు ఎం.ఏ హకీమ్ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక అధికారి నాగనాథ్ ను శాలువతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ అందరి సమిష్టి నిర్ణయం మేరకు గ్రామ అభివృద్ధి ప్రణాళికను రూపొందించి గ్రామ అభివృద్ధికై పాటుపడతానని ఆయన అన్నారు.అలాగే మాజీ మండల కోఆప్షన్ సభ్యులు మాట్లాడుతూ.గ్రామ సమస్యలపై ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేయాలని ఆయన ప్రత్యేక అధికారికి సూచించారు.గ్రామ అభివృద్ధి లో తన యొక్క పూర్తి సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని ఆయన అన్నారు.అనంతరం ఎం.ఏ హకీమ్ ప్రత్యేక అధికారులతో కలిసి గ్రామంలోని ప్రభుత్వ ఉర్దూ తెలుగు మీడియం పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భంగా తెలుగు మీడియం పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనాన్ని వారు ఇరువురు పరిశీలించారు.తదనంతరం గత నెల రోజుల నుండి గ్రామం లోని ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందక అనేక ఇబ్బందులకు గురైతున్న త్వరునంలో ఎం.ఏ హకీమ్ తన పుట్టి పెరిగి చదువుకున్న ఊరిపై మమకారంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులకు నెల రోజులకు సరిపడా మధ్యాహ్న భోజన సరుకులను ఆయన అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ రాజేశ్వరి,తాజా మాజీ సర్పంచ్ షేక్ షేరు,తెలుగు,ఉర్దూ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుకుణాకర్,వజాహత్ హునిస్సా,కాంగ్రెస్ పార్టీ మండల మైనార్టీ ప్రెసిడెంట్ వాజిత్,మాజీ ఎంపీటీసీ ఆసిఫ్,మాజీ ఉప సర్పంచ్ మస్తాన్,మాజీ వార్డ్ మెంబర్ అబిబ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు గౌస్,బాబా, ఇస్మాయిల్,యశ్వంత్, ఇబ్రహీం,రాములు,తస్లీమ్ ఖాన్,జలీల్ తదితరులు పాల్గొన్నారు.


## అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టాక్టర్ల పట్టివేత



బాన్సువాడ/కోటగిరి లోకం తీరు:-బాన్సువాడ నియోజక వర్గం పోతంగల్ మండల కేంద్రంలో సోమవారం రాత్రి విశ్వసనీయ సమాచారం మేరకు మంజీర నది నుంచి అక్రమంగా తరలిస్తున్న 4 ఇసుక ట్రాక్టర్లను కోటగిరి పోలీసులు పట్టుకున్నారు.తగు చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు ఇసుక ట్రాక్టర్ అప్పగించడం జరుగుతుందని ఎస్ఐ సందీప్ కుమార్ తెలిపారు.ఉమ్మడి మండలంలో ఎవరైనా అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అలాగే వేబీల్ ఉన్న వారు సంబంధిత అధికారులు తెలిపినసమయంలోమాత్రమే వాహనాలను నడపాలని ఆయన సూచించారు.

## పట్టుబడిన పిడిఎస్ బియ్యానికి వేలంపాట

బాన్సువాడ కోటగిరి లోకం తీరు:-నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 15 న కోటగిరి తాహాసిల్దార్ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గం.లకు పిడిఎస్ బియ్యానికి వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్వో ఒక ప్రకటనలో తెలిపారు.కరం ఇండస్ట్రీ, బాలాజీ ట్రేడర్స్ కోటగిరి నందు నిల్వ ఉంచిన 51.50 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యానికి వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ.5 వేలు దరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.ఈ వేలం పాటలో అధిక ధర పలికిన వారు ఏక మొత్తంలో పైకము చెల్లించి తదుపరి పైకం విషయంలో పూర్తిగా చెల్లించి అధికారుల అనుమతితో బియ్యాన్ని స్వాధీన పరుచు కోవాలన్నారు.



# గ్రామీణ బంద్ ను విజయవంతం చేయండి

**దేశ వ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయండి**
**కిసాన్ నగర్ లో పోస్టర్లు ఆవిష్కరణ**





బాల్కొండ ఫిబ్రవరి 13 ( లోకం తీరు) కేంద్రం లో ఉన్న బిజెపి, కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతికటిద్దాం మోడీ ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిసీటు ప్రకటిద్దాం అని ప్రభుత్వ వ్యతిరేక విధాలు నిరసిస్తూ ఈ నెల 16వ తేదీన బంద్ చేయాలని భారత కార్మిక సంఘల సమాఖ్య ఐఎఫ్టియు ఐ ఎఫ్ టీ యు ఆధ్వర్యంలో బాల్కొండ మండల పరిధిలోని కిషన్ నగర్ లో సిజె బీడీ కంపెనీ సెంటర్ లో దేశ వ్యాప్త కార్మిక సమ్మె వల్ పోస్టర్ లను ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ ఏం,ముత్తన్న, మాట్లాడుతూ కేంద్ర బిజెపి కార్పొరేట్ మత్తుతో విధానాలను ధిక్కరిస్తూ ప్రతిఘటనకు పూనుకోవాలని కేంద్ర ప్రభుత్వ విఫలాలను ప్రకటిస్తూ లక్షలాది కుటుంబాల ఇంటింటికి చేయాలని 2024 ఫిబ్రవరి 16 కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్ నిర్వహించాలని జాయింట్ ప్లాట్ఫారం ఆఫ్ ట్రేడ్ యూనియన్, ఉద్యోగ సంఘాలు, అఖిల భారత ఫెడరేషన్ సంఘాలు నిర్ణయం తీసుకుంది, తెలంగాణ రాష్ట్ర కార్మికులు, గ్రామీణ బంద్ నీ జయప్రదం చేయాలని వారు ఒక ప్రకటనలో తెలిపారు . కేంద్ర బిజెపి ప్రభుత్వం అధికారానికి వచ్చే పది సంవత్సరాలు పూర్తయింది ఆయన రైతాంగ కార్మిక ప్రజల సమస్యలను పరిష్కరించాలేదు, భారత్ వెలిగిపోతుంది, అచ్చా దిన్ అయెగ ,విశ్వగురు, ఆత్మనిర్భర్ భారత్, మేకింగ్ ఇండియా, మోసపూరిత నినాదాలు ఇచ్చిన ఏమి జరగలేదు. బిజెపి అధికారంలో వస్తే ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీలు ఇచ్చారు నేడు ఉద్యోగ కల్పన పడిపోయింది, నిరుద్యోగం గత 50 సంవత్సరాల గరిష్ట స్థాయికి చేరింది శ్రామికుల నిజ వేతనాలు 20% తగ్గిపోయాయి ప్రపంచంలోని 125 దేశాల్లో, ఆకలితో భారత్ 111 వ స్థానంలో ఉంది. మానవ అభివృద్ధి దేశాల్లో. 191 ఇండియా 132వ స్థానం ఉంది. ఇలాంటి అనేక సమస్యలు ఇండియాలో తలెత్తుతున్నాయి కాబట్టి మోడీ విధానాల వల్ల మధ్యతరగతి ప్రజల జీవితాలు అతలాకుతలమైతున్నాయి కాబట్టి వీటిని ప్రజలు వ్యతిరేకించాలని ప్రభుత్వ రంగ సంస్థలు కేంద్రం కార్బన్డేట్లకు అమ్మేస్తుందని వీటిని మనం వ్యతిరేకించాలని వారు పిలుపునిచ్చారు. అందుకే ఈనెల 16వ తేదీన దేశవ్యాప్త బందును విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో నజీర్,ఏం డి పయస్, రాజేశ్వర్,ఉమేష్,వినోద్, ఇత్యస్,, బీడీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## నేడే అబుదాభి లో అతి పెద్ద హిందూ ఆలయం ప్రారంభం



ఢిల్లీ ప్రతినిధి,ఫిబ్రవరి 13( లోకం తీరు):-యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో నిర్మించిన అతిపెద్ద హిందూ ఆలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. దాదాపు 27 ఎకరాల విస్తీర్ణంలో భారతీయ శిల్పకళా సౌందర్యం, హిందూ ధర్మం ఉట్టిపడేలా బాప్స్ స్వామినారాయణ్ సంస్థ దీన్ని నిర్మించింది. ఫిబ్రవరి 14న భారత ప్రధాని నరేంద్ర మోదీ విశిష్ట అతిథిగా ఈ ఆలయంలో దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవానికి రంగం సిద్ధమైంది. ప్రధాని ఇప్పటికే యూఏఈకి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఆలయ విశేషాలను తెలుసుకుందాం.. బోచసన్వాసి అక్షర్‌పురుషోత్తం స్వామినారాయణ్ పేరిట అబుదాబిలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ హిందూ దేవాలయానికి ఏడు గోపురాలు ఉంటాయి. అరబ్ ఎమిరేట్స్‌లో ఏడు ఎమిరేట్‌లకు ప్రతీకగా ఈ గోపురాల్ని నిర్మించారు. రాజస్థాన్ నుంచి దిగుమతి చేసుకున్న పాలరాయిని నిర్మాణంలో వినియోగించారు. వేలాది మంది శిల్పులు, కార్మికులు దాదాపు మూడేళ్లుగా శ్రమించి ఈ అద్భుత కట్టడంలో భాగస్వాములయ్యారు. 402 తెల్ల పాలరాతి స్తంభాలను ఇందులో అమర్చారు. ఒక్కో స్తంభంపై దేవతామూర్తులు, నెమళ్లు, ఏనుగులు, ఒంటెలు, సూర్యచంద్రులు, సంగీత పరికరాలు వాయిస్తున్న విద్వాంసులు.. ఇలా అనేక శిల్పాలను చెక్కారు.దాదాపు రూ.700 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ఆలయం దిగువ భాగంలో పవిత్ర గంగా, యమునా నదీ ప్రవాహాన్ని మరిపించేలా కృత్రిమ ప్రవాహాన్ని, ప్రత్యేక ఫోకస్ లైట్లను ఏర్పాటు చేశారు. దుబాయి-అబుదాబి మార్గంలో 55వేల చదరపు మీటర్ల పరిధిలో దీన్ని నిర్మించారు. యూఏఈలో భారత రాయబారి సంజయ్ సుధీర్ ఆధ్వర్యంలో 42 దేశాలకు చెందిన రాయబారులు తమ జీవిత భాగస్వాములతో కలిసి అద్భుత ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సంజయ్ సుధీర్ మాట్లాడుతూ.. అసాధ్యమనుకున్నది వాస్తవరూపం దాల్చిందన్నారు. బాప్స్ హిందూ ఆలయ ప్రాజెక్టు చీఫ్ స్వామి బ్రహ్మవిహారి దాస్ ఆలయ చారిత్రక ప్రాముఖ్యత, నిర్మాణం, ఇతర అంశాలను వివరించారు.అబుదాబిలోని ః౦ఖూ హిందూ ఆలయం పశ్చిమాసియాలోనే అతి పెద్దది. 32.92 మీటర్లు (108 అడుగులు) ఎత్తు, 79.86 మీటర్లు (262 అడుగులు) పొడవు, 54.86 మీటర్లు (180 అడుగులు) వెడల్పుతో ఆలయాన్ని ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దారు. అత్యంత క్లిష్టమైన రీతిలో ఫలకాలపై రామాయణం, శివపురాణం, భాగవతం, మహాభారతంతో పాటు జగన్నాథుడు, స్వామి నారాయణుడు, వేంకటేశ్వరుడు, అయ్యప్ప కథలను వర్ణించారు. ఆలయ ప్రాంగణంలో సందర్శకుల కేంద్రాలు, ప్రార్థనా మందిరాలు, ఎగ్జిబిషన్లు, లెర్నింగ్ ఏరియాలు, పిల్లల క్రీడా ప్రాంతాలు, ఉద్యానవనాలు, వాటర్ ఫీచర్లు, ఫుడ్ కోర్టులు, పుస్తకాలు, గిఫ్ట్ షాపులు ఉంటాయి. మందిర్ ఫౌండేషన్ పెద్ద సంఖ్యలో సెన్సార్లను ఏర్పాటు చేసింది. భూకంపం, ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు వంటి వాతావరణ మార్పులపై అవి నిరంతరం డేటాను సేకరిస్తాయి.

## "వికసిత్ భారత్ సంకల్ప యాత్ర-2"

**కేంద్ర ప్రభుత్వ పథకాలను సాద్వినియోగం చేసుకోవాలి..**
**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ .**







నిజామాబాద్ అర్బన్ ఫిబ్రవరి 13(లోకంతీరు):నిజామాబాద్ నగరంలోనాగారం పదవ డివిజన్ లొ గోశాల దగ్గర ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర -2 కార్యక్రమానికి ముఖ్యతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు బిజెపి కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ భారత దేశ అభివృద్దే లక్షంగా దేశంలో పల్లెలు, పట్టణాల అభివృద్దే ద్యేయంగా పని చేయడం జరుగుతుందని, అట్టడుగుస్థాయి చిట్టచివరకు ఉన్న నిరుపేదలకు కూడ కేంద్ర ప్రభుత్వ ఫలాలు అందించాలనే లక్ష్యంతో బిజెపి పార్టీ పని చేస్తుందని, అందులోనే భాగంగా నవంబర్ 15న ఆదివాసీ ముద్దుబిడ్డ బిర్స ముండా జయంతి, ఆదివాసీ గౌరవ దివస్ సందర్భంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరుతో ఢిల్లీ నుండి గల్లీ, గల్లికి మోడీ సంక్షేమ పథకాల బండి రెండో విడత వస్తుందని, కేంద్రప్రభుత్వం ప్రజాశ్రేయస్సు కోసం వారి సంక్షేమం కోసం ఉజ్వల యోజన క్రింద ఉచిత గ్యాస్ కనెక్షన్స్,గరీబ్ అన్న కళ్యాణ్ యోజన కింద ఉచిత రేషన్ బియ్యం పంపిణీ, ఉచిత కరోనా టీకా,స్వచ్ భారత్ కింద మరుగుదొడ్ల నిర్మాణం, ఆయుష్మాన్ భారత్ పథకంతో ఐదు లక్షల బీమా, ముద్ర యోజన కింద చిరు వ్యాపారులకు చేయూతగా, సుకన్య సమృద్ధి యోజన ద్వారా ఆడబిడ్డలకు ఆర్థిక భద్రత, అవస్ యోజన కింద పేదలకు ఇళ్ల నిర్మాణం, విశ్వకర్మ యోజన కింద చేతి వృత్తుల వారికీ చేయూతగా ఇలా అనేక సంక్షేమ పథకాలు తీసుకురావడం జరిగిందని, ఇంకా అర్హులైన వారందరు వెంటనే దరఖాస్తు చేసుకొని లబ్ది పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్,ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మనాయక్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు స్రవంతి రెడ్డి,మాస్టర్ శంకర్, ఇప్పకాయల కిషోర్,సుదీర్,ప్రవళిక ఉ శ్రీధర్ వెంట్ట విజయ్,సుక్క మధు,ఆకుల శ్రీనివాస్,వెల్డింగ్ నారాయణ,మండల అధ్యక్షులు వీరేందర్,గడ్డం రాజు,పవన్,చిరంజీవి సతీష్ గట్ల గంగాధర్, దీపక్, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఫిబ్రవరి 14 ను 'కౌహగ్ డే' గా జరుపుకోవలి.

**- ప్రేమికుల రోజు కు బదులుగా - విభిన్నంగా జరుపుకోవాలి కేంద్ర ప్రభుత్వం**





కామారెడ్డి జిల్లా రామారెడ్డి ఫిబ్రవరి 13 (లోకం తీరు)ఫిబ్రవరి 14 ప్రేమికుల దినోత్సవం. ప్రేమను వ్యక్తపరిచేందుకు అనువైన రోజు అని ప్రేమికులు భావించే రోజు. అయితే ఈ వాలెంటైన్స్ డేను కాస్త విభిన్నంగా జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం కోరుతోంది. ఎలా జరుపుకోవాలంటే,ప్రేమికుల దినోత్సవ సందడి మొదలైంది. వన్ సైడ్ లవర్స్ ప్రపోజ్ చేసేందుకు రెడీ అవుతుండగా,ఇప్పటికే ప్రేమలో ఉన్న జంటలు తమ లవర్స్‌కు డిఫరెంట్ గిఫ్ట్ ఇచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు. అయితే లవర్స్ డేను డిఫరెంట్‌గా జరుపుకోవాలని యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఏడబ్ల్యుబిఐ) విజ్ఞప్తి చేసింది. ఫిబ్రవరి 14న 'కౌ హగ్ డే' జరుపుకోవాలని దేశ ప్రజలను కోరింది. ఆవును కౌగిలించుకుని మూగజీవాల పట్ల ప్రేమను వ్యక్తం చేయడం వలన పాజిటివ్ ఎనర్జీ మానసిక ఆనందం కలుగుతాయని భారతీయ సనాతన ధర్మానికి గోవులు వెన్నుముకని గోమాతను కామదేవు గా పిలుస్తారు. అని సూచించింది.

## టీయుడబ్ల్యుజే ఐజేయు డైరీ ఆవిష్కరణ

**జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తాము**
**జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**



నిజామాబాద్ ,ఫిబ్రవరి 13(లోకంతీరు):తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యుజే) యూనియన్ డైరీని మంగళవారం నిజామాబాద్ కలెక్టర్ ఛాంబర్ లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆవిష్కరించారు. డైరీని ఆవిష్కరించిన కలెక్టర్ యూనియన్ పూర్వాపరాలు, ప్రస్తుత స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు అక్రిడిటేషన్ కార్డు సమస్యతో పాటు నిజామాబాద్ ప్రెస్ క్లబ్ నిర్మాణం గురించి కలెక్టర్ తో ప్రస్తావించారు. దీంతో స్పందించిన కలెక్టర్ అర్ అండ్ బి అధికారులతో మాట్లాడారు. ప్రెస్ క్లబ్ నిర్మాణానికి నిధులు కేటాయింపు, టెండర్ వివరాలను వెంటనే తెలపాలని, నిధులు మంజూరైతే, వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే అక్రిడిటేషన్ను సమస్యను పరిష్కరిస్తామని, జూన్ లో రెన్యూవల్ కాకపోతే అదే నెలలో సమస్యలు లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంజీవ్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టి. అరవింద్ బాలాజీ, నేషనల్ కౌన్సిల్ సభ్యులు గంగాదాస్, జిల్లా కోశాధికారి సిరిగాధ ప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ప్రమోద్ గౌడ్, నిజామాబాద్ ప్రెస్ క్లబ్ కార్యదర్శి శేఖర్, నందాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ ఏడాది మెరుగ్గా వర్షాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13 దేశానికి అన్నం పెట్టే రైతన్నకు, వ్యవసాయ రంగానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని ముఖ్యంగా జూన్‌లో రానున్న నైరుతి రుతుపవనాలు రైతుల కళ్ళల్లో ఆనందాన్ని ఇచ్చే విధంగా ఉన్నాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. వచ్చే జూన్ నుంచి సెప్టెంబర్ వరకు మెరుగ్గా వర్షాలు పడతాయని అంచనా వేస్తున్నారు. గత సీజన్‌లో పడిన వర్షపాతం కంటే కూడా వర్షాలు మెరుగ్గా ఉంటాయని అంటున్నారు నిపుణులుపసిఫిక్ మహాసముద్రంలో లాస్ట్ ఇయర్ నుంచి కొనసాగుతున్న ఎల్ నినో బలహీనపడి జూన్ నాటికి పూర్తిస్థాయిలో బలహీనపడుతుందని.. నైరుతి రుతుపవనాలు వచ్చిన తర్వాత లానినా ఏర్పడుతుందని దేశీయ అంతర్జాతీయ స్థాయిలో ఉన్న కొన్ని వాతావరణ సంస్థలు చేపట్టిన సర్వేలో తెలిసింది. ఈ ఎల్ నినో ఇలాగే కొనసాగితే ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై ప్రభావం ఉంటుందని.. దీనివల్ల ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతో పాటు, వర్షపాతం తక్కువగా నమోదు కావడం, కొన్నిచోట్ల అనుకోని విపత్తులు ఉంటాయని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా భారత ఉపఖండంపై ఈ ఎల్ నీనో ప్రభావం ఎక్కువగా ఉంటుందని అంచనా. కానీ ప్రస్తుత పరిస్థితులు గమనిస్తుంటే ఏప్రిల్ నుంచి ఎల్ నినో బలహీనపడి ఆగష్టు నాటికి లానినా బలపడుతుందని భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి ఈ విషయాన్ని తెలిపారు.లాస్ట్ ఇయర్ నైరుతి సివిజన్‌లో సాధారణ ̄ కంటే ఈ ఇయర్ సమ్మర్‌లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని ప్రపంచ వాతావరణ సంస్థ వెల్లడించింది.

# సినిమా తీరు

## త్రివిక్రమ్.. ఆ కథను పక్కన పెట్టేసి..



మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఇటీవల గుంటూరు కారం సినిమాతో అనుకున్నంత స్థాయిలో అయితే సక్సెస్ అందుకోలేకపోయాడు. మహేష్ స్టార్ ఇమేజ్ కారణంగా సినిమాకు బాక్స్ ఆఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్ అయితే వచ్చాయి. ఇక ఓటీటీ లో కూడా సినిమాకు పరవాలేదు అనే విధంగా రెస్పాన్స్ అయితే వస్తోంది. అయితే త్రివిక్రమ్ ఇప్పుడు తను తదుపరి ప్రాజెక్టుపై పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టాడు.త్రివిక్రమ్ నెక్స్ట్ ప్రాజెక్ట్ అల్లుఅర్జున్ తో చేయబోతున్నట్లుఅ మధ్య క్లారిటీ ఇచ్చారు. అనంతరం ఈ కాంబినేషన్ వాయిదా పడే అవకాశం ఉందని కూడా గాసిప్స్ వచ్చాయి. అయితే మళ్లీ అల్లు అర్జున్ త్రివిక్రమ్ ను లైన్లోకి తీసుకువచ్చినట్లుగా కొత్త టాక్ అయితే వైరల్ అవుతుంది. ఇక త్రివిక్రమ్ కు పోటీగా మరోవైపు బోయపాటి శ్రీను కూడా ఉన్నాడు. అతడు కూడా అల్లు అర్జున్ కోసం పవర్ఫుల్ మాస్ యాక్షన్ కథను సిద్ధం చేసే పనిలో బిజీగా ఉన్నాడు. ఒకప్పుడు బ్యూటీ.. గుర్తుపట్టలేని విధంగా షాకింగ్ లుక్ ఇక అల్లు అర్జున్ ను ఎవరైతే ముందుగా కథతో మెప్పిస్తారో వాళ్లే ప్రాజెక్టును మొదట స్టార్ట్ చేసే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. ఇక త్రివిక్రమ్ నెక్స్ట్ మరో ఫ్యామిలీ కథతోనే ప్రేక్షకుల ముందుకు రావాలి అని అనుకున్నాడు. హీరో ఫ్యామిలీ విడిపోవడంతో మళ్లీ ఎలాగైనా అందరిని కలపాలి అని పాయింట్ తో అసలు కథను సిద్ధం చేసుకున్నారట. కామెడీతోపాటు మంచి ఎమోషన్స్ ఉండేలా త్రివిక్రమ్ స్క్రిప్ట్ సిద్ధం చేసినట్లుగా తెలుస్తోంది. అయితే అల్లు అర్జున్ రేంజ్ ప్లాన్ ఇండియా స్థాయికి పెరిగిపోవడం వలన అలాంటి కథలు చేసే అవకాశం లేదు. కాబట్టి ఇప్పుడు త్రివిక్రమ్ పాన్ ఇండియా రేంజ్ లో కథను సిద్ధం చేసే పనిలో బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది. యూనివర్సల్ కాన్సెప్ట్ ఉండేలా పెన్ను పదును పెంచుతున్నట్లు టాక్. అసలే పుష్ప తర్వాత అల్లు అర్జున్ రేంజ్ అమాంతం పెరిగిపోయింది. పుష్ప 2తో బాక్సాఫీస్ వద్ద 1000 కోట్ల టార్గెట్ అందుకోవాలి అని బన్నీ చాలా హార్డ్ వర్క్ చేస్తున్నాడు. ఈ క్రమంలో త్రివిక్రమ్ నుంచి వచ్చే ప్రాజెక్టు కూడా అదే రేంజ్ లో ఉండాలి. అందుకే భారీ స్థాయిలోనే కథను సిద్ధం చేసుకోవాలి అని త్రివిక్రమ్ కు సూచించినట్లుగా తెలుస్తోంది. మరి ఆ అంచనాలకు తగ్గ కథను మాటల మాంత్రికుడు ఏ స్టైల్లో సిద్ధం చేస్తాడో చూడాలి.

## సలార్-2 తొమ్మిది నెలలు ముందుకొచ్చేసిందా?



'సలార్ -2' షూటింగ్ తొమ్మిది నెలలు ముందుకు వచ్చేస్తుందా? ఆలస్యం అమృతం విషం అన్న చందంగా ప్రశాంత్ నీల్ నిర్ణయం మార్చుకున్నాడా? డార్లింగ్ సైతం అందుకు నో చెప్పకుండా ఎస్ నేను సిద్ధం అనే సాడా? అంటే అవుననే తెలుస్తోంది. ఈ కాంబినేషన్ లో రిలీజ్ అయిన 'సలార్ సీజ్ ఫైర్'ఎలాంటి విజయం సాధించిందో తెలిసిందే. బాక్సాఫీస్ వద్ద 700 కోట్లకు పైగా వసూళ్లని సాధించింది. ఈ సినిమా కోసం ప్రభాస్ సహా టీమ్ అంతా ఎంతో కష్టపడ్డారు. దాదాపు రెండు సంవత్సరాలుగా ఈచిత్రాన్ని పూర్తిచేసే పనిలోనే అంతా బాండ్ అయి పనిచేసారు త్రివిక్రమ్.. ఆ కథను పక్కన పెట్టేసి.. భారీ కాన్వాస్ పై తెరకెక్కిన చిత్రం కావడంతోనే ఇంత సమయం పట్టింది. ఈ నేపథ్యంలో 'సలార్ -2' ఆలస్యం అవ్వొచ్చని ముందుగానే గెస్సింగ్స్ తెరపైకి వచ్చాయి. కానీ 15 నెలల్లోనే పూర్తి చేసి రిలీజ్ చేస్తామని హోంబలే ఫిల్మ్స్ నుంచి ప్రకటన వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రశాంత్ నీల్-ప్రభాస్ తొమ్మిది నెలల వరకూ ఆ సినిమా గురించి ఆలోచించే పనికూడా లేదని తెరపైకి వచ్చింది. సలార్ తో బాగా అలసిపోవడంతో విరామం కూడా ఎక్కువగానే అవసరం అవుతుందని భావించి అన్ని నెలలు గ్యాప్ ఇస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. గుర్తుపట్టలేని విధంగా షాకింగ్ లుక్ అయితే ప్రశాంత్ నీల్ ఇప్పుడా అలసటని పక్కనబెట్టినట్లు సమాచారం. సినిమాని తొమ్మిది నెలలు తర్వాత కాదు.. తొమ్మిది నెలలు ముందుకు తీసుకొచ్చి చిత్రాన్ని వీలైనం వేగంగా పూర్తి చేసి రిలీజ్ చేయాలని కంకణం కట్టుకున్నాడుట. దీనిలో భాగంగా ఇప్పటికే 'సలార్ -2' కి సంబంధించిన పనులు కూడా మొదలు పెట్టినట్లు సమాచారం. స్క్రిప్ట్ కి అవసరమైన మెరుగులు దిద్దుతున్నారుట. అది పూర్తయిన వెంటనే సెట్స్ పైకి వెళ్లిపోవాలని ప్లాన్ చేస్తున్నారు. ఇదే విషయాన్ని ప్రభాస్ కి చెబితే ఆయన కూడా నో చెప్పకుండా రోడీ అనేసారుట. ప్రభాస్ నటిస్తోన్న కల్కి 2898 ఎలాగూ మే లో రిలీజ్ అయిపోతుంది. అప్పటి నుంచి డార్లింగ్ ఖాళీ అయిపోతాడు. మారుతి సినిమా 'రాజాసాబ్' ఉంది కానీ సలార్ -2 కంటే ప్రాధాన్యమున్న సినిమా కాదు కాబట్టి తాత్కాలికంగా ఆప్రాజెక్ట్ ని పక్కన బెట్టాలనే ఆలోచనలో ఉన్నట్లు ఫిలిం సర్కిల్స్ టాక్.

## హెచ్చరిక! మీ చర్మంపై ఈ లక్షణాలు ఉన్నాయా? అయితే మీ శరీరంలో షుగర్ లెవల్స్ ఎక్కువగా ఉన్నట్లే..!



మధుమేహం, సాధారణంగా మధుమేహం అంటారు. ఇది దీర్ఘకాలిక జీవక్రియ రుగ్మత. మధుమేహం భారతదేశంలోనే 100 మిలియన్ల కంటే ఎక్కువ మంది ప్రజలను మరియు ప్రపంచవ్యాప్తంగా బిలియన్ల మంది ప్రజలను ప్రభావితం చేస్తుంది. ఊబకాయం, అనారోగ్యకరమైన జీవనశైలి మరియు ఆహారం వంటి అనేక కారణాల వల్ల మధుమేహం వస్తుంది. దీర్ఘకాలిక ఆరోగ్య పరిస్థితిగా ఉండటం వల్ల మధుమేహం మీకు వివిధ ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. గుండె జబ్బులు మరియు నరాల దెబ్బతినడం వంటి మధుమేహం యొక్క సాధారణ సమస్యల గురించి చాలా మందికి తెలుసు. మధుమేహ వ్యాధిగ్రస్తులు హెచ్‌బిఎ1సపరీక్ష తప్పనిసరిగా ఎందుకు చేయించుకోవాలి!: మధుమేహ వ్యాధిగ్రస్తులు హెచ్‌బిఎ1సి) పరీక్ష తప్పనిసరిగా ఎందుకు చేయించుకోవాలి! అయినప్పటికీ, చర్మంపై ఈ పరిస్థితి యొక్క ప్రభావం తరచుగా నిర్లక్ష్యం చేయబడుతుంది. చర్మం మీ మొత్తం ఆరోగ్యానికి అద్దం. మీ చర్మం మీ శరీరంలోని అనేక సమస్యలను వెల్లడిస్తుంది. మరియు మధుమేహం వివిధ చర్మ లక్షణాలలో వ్యక్తమవుతుంది. మీ చర్మం మీ శరీరంలో అధిక రక్త చక్కెర స్థాయిల సంకేతాలను వెల్లడిస్తుంది. మీరు ఈ చర్మ వ్యక్తీకరణల గురించి తెలుసుకోవాలి. రక్తంలో చక్కెర స్థాయి ఎక్కువగా ఉన్నప్పుడు మీ చర్మానికి వచ్చే సమస్యల గురించి తెలుసుకోవడానికి ఈ కథనాన్ని చదవండి. డయాబెటిక్ డెర్మోపతిఇది సాధారణ గుండెల్లో మంట కాదని, గుండెపోటు లక్షణమని ఎలా తెలుసుకోవాలి? ఇది సాధారణ గుండెల్లో మంట కాదని, గుండెపోటు లక్షణమని ఎలా తెలుసుకోవాలి? మధుమేహం యొక్క అత్యంత సాధారణ చర్మ వ్యక్తీకరణలలో ఒకటి డయాబెటిక్ డెర్మోపతి. ఈ పరిస్థితి లేత గోధుమరంగు లేదా ఎరుపు, పొలుసుల మచ్చలు, ఎక్కువగా దవడలపై కనిపిస్తుంది. డయాబెటిక్ డెర్మోపతి నిరపాయమైనది మరియు సాధారణంగా ఎటువంటి అసౌకర్యం లేదా దురదను కలిగించదు. ఇది చర్మం కింద ఉండే చిన్న రక్తనాళాల్లో మార్పుల వల్ల వస్తుంది. ఇది చర్మం ఆకృతి మరియు పిగ్మెంటేషన్‌లో మార్పులకు దారితీస్తుంది. పాచెస్ కాలక్రమేణా మసకబారినప్పటికీ, అవి అలాగే ఉంటాయి. మీ చర్మంపై ఈ లక్షణం రక్తంలో చక్కెర స్థాయిలు అనియంత్రిత స్థాయిని సూచిస్తుంది.

అకాంటోసిస్ నైగ్రికన్స్ అకాంతోసిస్ నైగ్రికన్స్ అనేది మధుమేహంతో సంబంధం ఉన్న మరొక చర్మ పరిస్థితి. ఇది మెడ, చంకలు మరియు గజ్జలు వంటి శరీర మడతలలో సాధారణంగా కనిపించే ముదురు, మందపాటి మరియు వెల్వెట్ చర్మం ద్వారా వర్గీకరించబడుతుంది. ఈ పరిస్థితి ఇన్సులిన్ నిరోధకతకు సంకేతం. ఇది టైప్ 2 డయాబెటిస్‌కు పూర్వగామి. ' అకాంతోసిస్ నైగ్రికన్లు ఊబకాయంతో సంబంధం కలిగి ఉండవచ్చు, ఇది మధుమేహం వచ్చే ప్రమాదం ఉన్న వ్యక్తులలో ముఖ్యమైన లక్షణం. మీ చర్మంపై ఈ లక్షణాలు ఉంటే, వెంటనే నిపుణుడిని సంప్రదించండి. డయాబెటిక్ బొబ్బలు మధుమేహం ఉన్న వ్యక్తులు బులోసిస్ డయాబెటికోరం అనే అసాధారణమైన మరియు అరుదైన ఆరోగ్య పరిస్థితిని అనుభవించవచ్చు. పాదాలు, చేతులు, కాళ్లు లేదా ముంజేతులపై పెద్ద, నొప్పిలేకుండా బొబ్బలు హఠాత్తుగా కనిపించడం ద్వారా ఈ పరిస్థితి వర్గీకరించబడుతుంది. ఈ బొబ్బలు బాధితులకు ఒక హెచ్చరిక కావచ్చు. కానీ, అవి సాధారణంగా ఇన్ఫెక్షన్లతో సంబంధం కలిగి ఉండవు. బుల్లస్ డయాబెటిస్ యొక్క ఖచ్చితమైన కారణం అస్పష్టంగా ఉంది. కానీ ఇది నరాల దెబ్బతినడం మరియు పేద రక్త ప్రసరణకు సంబంధించినదని నమ్ముతారు. నెక్రోబయోసిస్ లిపోయిడికా నెక్రోబయోసిస్ లిపోయిడికా డయాబెటిస్ అనేది దీర్ఘకాలిక చర్మ వ్యాధి. ఇది ప్రధానంగా దిగువ కాళ్లను ప్రభావితం చేస్తుంది. ఇది ప్రత్యేకమైన సరిహద్దులతో మెరిసే, ఎరుపు-గోధుమ గాయాల వలె కనిపిస్తుంది. కాలక్రమేణా, ఈ పుండ్లు ఓపెన్ పుళ్ళుగా మారవచ్చు, సంక్రమణ ప్రమాదాన్ని పెంచుతుంది. నెక్రోబయోసిస్ లిపోయిడికా చర్మంలోని రక్తనాళాలు మరియు కొల్లాజెన్‌లో మార్పులతో సంబంధం కలిగి ఉంటుందని భావిస్తున్నారు. మరియు ఈ వ్యాధి సాధారణంగా టైప్ 1 డయాబెటిస్‌లో కనిపిస్తుంది. నెక్రోబయోసిస్ లిపోయిడికా నిర్వహణలో సరైన రక్తంలో చక్కెర నియంత్రణ మరియు గాయం సంరక్షణ ముఖ్యమైనవి. డయాబెటిక్ ఫుట్ అల్సర్స్ మధుమేహంతో సంబంధం ఉన్న చర్మ సమస్యలలో ఒకటి డయాబెటిక్ ఫుట్ అల్సర్. అధిక రక్త చక్కెర నరాల నష్టం (డయాబెటిక్ న్యూరోపతి) మరియు పాదాలకు రక్త ప్రవాహాన్ని తగ్గిస్తుంది (పరిధీయ వాస్కులర్ వ్యాధి). ఫలితంగా, చిన్న గాయాలు లేదా కోతలు గుర్తించబడవు. ఇది నాన్-హీలింగ్ అల్సర్లకు దారి తీస్తుంది. చర్మంపై వచ్చే అంటువ్యాధులు చికిత్స చేయడం కష్టం. డయాబెటిక్ ఫుట్ అల్సర్‌లను నివారించడానికి మరియు నిర్వహించడానికి సరైన పాద సంరక్షణ మరియు రెగ్యులర్ చెకప్‌లు చాలా అవసరం. ఇన్ఫెక్షన్ మరియు దురద ఇమ్యునో డిఫిషియెన్సీ కారణంగా డయాబెటిక్ పేషెంట్లు రకరకాల చర్మ ఇన్ఫెక్షన్లకు గురవుతారు. సాధారణ అంటువ్యాధులు బాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు, ఫంగల్ ఇన్ఫెక్షన్లు (కాన్డిడియాసిస్ మరియు రింగ్వార్మ్ వంటివి) మరియు స్టెఫిలోకాకల్ ఇన్ఫెక్షన్లు. ' అదనంగా, మధుమేహంచర్మాన్ని గోకడం వల్ల ఓపెన్ పుండ్లు ఏర్పడతాయి, ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. చర్మ వ్యక్తీకరణలు మధుమేహం అనేది సంక్లిష్టమైన మరియు బహుముఖ ఆరోగ్య పరిస్థితి, ఇది చర్మంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది.

## గుంటూరు సెట్ లో విశ్వంభర విశ్వరూపం!

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా వశిష్ట దర్శకత్వంలో ' విశ్వంభర' షూటింగ్ శర వేగంగా జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే మారుడుమిల్లి అందాల్లో తొలి షెడ్యూల్ పూర్తి చేసిన యూనిట్ మలి షెడ్యూల్స్ హైదరాబాద్ లో చేస్తోన్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా ఏకంగా 13 ప్రత్యేకమైన సెట్లు నిర్మించి అక్కడే షూటింగ్ చేస్తున్నారు. ఆ సెట్ల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసారు. సోషియా ఫాంటసీ చిత్రం కావడంతో మాయావనం లాంటి సెట్లు నిర్మించి అక్కడే ప్రత్యేకమైన సన్నివేశాలు చిత్రీకరి స్తున్నారు. ఆ కథను పక్కన పెట్టేసి.. ఇటీవలే చిరంజీవి కూడా రెగ్యులర్ గా షూట్ లో పాల్గొంటున్నారు. ఆయనతో పాటు హీరోయిన్ గా ఎంపికైన త్రిష కూడా హాజరవుతుంది. ప్రస్తుతం వాళ్లిద్దరిపై కీలక సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు.




తొలి షెడ్యూల్ లో చిరంజీవి...త్రిష లేని సన్నివేశాలు చిత్రీకరించారు. ఈ నేపథ్యంలో సినిమాకి సంబంధించి మరో ఇంట్రెస్టింగ్ అప్ డేట్ అందింది. ప్రస్తుతం షూటింగ్ 'గుంటూరు కారం' కోసం నిర్మించిన సెట్స్ లో చేస్తున్నారు. ఒకప్పుడు బ్యూటీ.. గుర్తుపట్టలేని విధంగా షాకింగ్ లుక్ ఈ సినిమా షూటింగ్ సమయంలో కొల్లోరు లో ప్రత్యేకమైన సెట్ నిర్మించింది గుంటూరు యూనిట్. అయితే అలాంటి లొకేషన్లో చిత్రీకరించిన సన్నివేశాలు కొన్ని ఉండటంతో ఆ సెట్ ని విశ్వంభర చిత్ర యూనిట్ వినియోగించుకుంటుందిట. ఈ షూట్ లో చిరు-త్రిషలు పాల్గొంటున్నట్లు తెలిసింది. హైదరాబాద్ షూట్ తో పాటు సైమల్టేనియస్ గా ఇక్కడా షూట్ నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో చిరంజీవి భీమవరం దొరబాబు పాత్రలో కనిపిస్తారని ఇప్పటికే లీక్ అయిన సంగతి తెలిసిందే. సలార్-2 తొమ్మిది నెలలు ముందుకొచ్చేసిందా? దొరబాబు పాత్ర అనేది మాస్ లుక్ తో డిజైన్ చేసి ఉంటుందని తెలిసింది. ఆ పాత్రకి సంబంధించిన సన్ని వేశాలో గుంటూరు కారం సెట్స్ లో చేస్తున్నట్లు తెలుస్తోంది. మరి సినిమాలో త్రిషని ఇంకెంత అందంగా చూపిస్తారు? అన్నది చూడాలి. త్రిషకి 40 ఏళ్లు మీద పడినా బ్యూటీ అంతకంతకు రెట్టింపు అవుతుందే? తప్ప తరగని అందంలా కనిపిస్తుంది.

## అందానికే మరో అందం....




## మరో హిందీ చంద్రముఖి.. రంగంలోకి మొదటి దెయ్యం



సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన బ్లాక్ బస్టర్ మూవీ చంద్రముఖి. ఈ సినిమా హారర్ కామెడీ చిత్రాల్లో ఓ ట్రెండ్ సెట్ చేసింది. చంద్రముఖి చిత్రంలో రజనీ మేనరిజం స్టైల్ తోపాటు జ్యోతిక నట విశ్వరూపం సినిమాను బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ చేసింది. గతేడాది ఈ మూవీ సీక్వెల్ గా చంద్రముఖి-2 తెరకెక్కింది. సీక్వెల్ లో నటించడానికి రజనీ ఆసక్తి చూపించకపోవడంతో ఆయన స్థానంలో రాఘవ లారెన్స్ హీరోగా నటించారు. జ్యోతిక బదులు బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కంగనా రనౌత్ నటించింది. ఆ కథను పక్కన పెట్టేసి.. తెలుగు, తమిళంలో మొదట ఈ సినిమాను తెరకెక్కించిన వాసునే సీక్వెల్ కు దర్శకత్వం వహించారు. గతేడాది సెప్టెంబర్ లో రిలీజైన ఈ చిత్రం బిగ్గెస్ట్ డిజాస్టర్ గా నిలిచింది. సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో ట్రోల్ చేశారు నెటిజన్లు. చూసిన సీన్నే మళ్లీ మళ్లీ చూసినట్లు ఉందని కామెంట్లు పెట్టారు. ఇక కంగన కూడా చంద్రముఖి రోల్ కు అస్సలు సెట్ కాలేదని అన్నారు. అయితే ఈ చంద్రముఖి సిరీస్ బాలీవుడ్ లోనూ తెరకెక్కిన విషయం తెలిసిందే. బీటౌన్ లో భూల్ భులయ్యా పేరుతో ఫస్ట్ పార్ట్ రిలీజై బ్లాక్ బస్టర్ హిట్ అయింది. ఈ మూవీలో అక్షయ్ కుమార్ హీరోగా నటించగా, విద్యాబాలన్ తన యాక్టింగ్ తో అదరగొట్టింది. ఆ తర్వాత సెకండ్ పార్ట్ లో విద్యాబాలన్ బదులు టబు, అక్షయ్ కుమార్ బదులు కార్తీక్ ఆర్యన్ నటించారు. ఆ సినిమా కూడా సూపర్ హిట్ అయింది. ఇప్పుడు బాలీవుడ్ చంద్రముఖి మూడో పార్ట్ మొదలైంది. గుర్తుపట్టలేని విధంగా షాకింగ్ లుక్ భూల్ భులయ్యా మేకర్స్.. ఫస్ట్ పార్ట్ లో నటించిన విద్యాబాలన్ ను మళ్లీ మూడో భాగానికి తీసుకున్నారు. ఈ విషయాన్ని నటుడు కార్తీక్ ఆర్యన్ ప్రకటించారు. షూటింగ్ కూడా మొదలైనట్లు చెప్పారు. దీపావళికి ఈ సినిమా విడుదల కానున్నట్లు వెల్లడించారు. అయితే బాలీవుడ్ మేకర్స్.. చంద్రముఖి సీక్వెల్స్ లో ఎక్కడా వాసు స్టోరీని తీసుకోకుండా కొత్త కథలు రాసుకుని తెరకెక్కిస్తుండడం గమనార్హం. ఈ మూడో పార్ట్ లో కార్తీక్ ఆర్యన్ కు జోడీగా హీరోయిన్ కియారా అద్వానీనే కొనసాగుతుందో లేదో ఇంకా తెలియరాలేదు. నీస్ బాజ్మీ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్ట్ లో ఎల్నాజ్ నొరౌజీ, నసీరుద్దీన్ షా, సారా అలీ ఖాన్ , రాజ్‌పాల్ యాదవ్, బోమన్ ఇరానీ తదితరులు నటించనున్నారు. మరి భూల్ భులయ్యా 3లో మంజులికగా విద్యాబాలన్ ఎలా ఆకట్టుకుంటుందో చూడాలి.

## ఇషాన్ కిషన్‌తో పాటు వారందరికీ భారీ షాకిచ్చిన బీసీసీఐ.. ఇక డైరెక్ట్ ఎంట్రీ కుదరదు..!

అంతర్జాతీయ మ్యాచ్‌లు, ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) తప్ప మరే ఇతర మ్యాచ్‌లు ఆడబోమని గిరిగీసుకుని కూర్చున్న పలువురు భారత క్రికెటర్లకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) భారీ షాకిచ్చింది. రెస్ట్ తీసుకుంటామని చెప్పి జట్టు నుంచి తప్పుకున్న క్రికెటర్లంతా తప్పకుండా దేశవాళీ క్రికెట్ ఆడాలని, నేరుగా జాతీయ జట్టులోకి ఎంట్రీ కుదరదని స్పష్టం చేసింది. ప్రస్తుతం జాతీయ జట్టుతో ఉన్న ఆటగాళ్లు, నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) లో రిహాబిలిటేషన్‌లో ఉన్న క్రికెటర్లు మినహా మిగిలినవారంతా నెక్స్ట్ రౌండ్ రంజీ మ్యాచ్‌లు ఆడాల్సిందేనని హుకుం జారీ చేసింది. ప్రత్యక్షంగా పేరు చెప్పకపోయినా టీమిండియా యువ వికెట్ కీపర్ ఇషాన్ కిషన్‌కు ఇది షాకే. కిషన్‌తో పాటు బరోడాలో ట్రైనింగ్ అవుతున్న హార్దిక్ పాండ్యా, కృనాల్ పాండ్యా, దీపక్ చాహర్, శ్రేయస్ అయ్యర్ లు కూడా దేశవాళీలో తమ రాష్ట్ర జట్లకు ప్రాతినిధ్యం వహించాల్సిందే.గతేడాది డిసెంబర్‌లో దక్షిణాఫ్రికా టూర్‌కు వెళ్లిన భారత జట్టులో ఉన్న ఇషాన్ కిషన్.. వన్డే సిరీస్ ఆరంభానికి ముందే వ్యక్తిగత కారణాలు చెప్పి ఇంటికి తిరిగొచ్చాడు. మానసిక సమస్యలతో బాధపడుతున్న ఇషాన్.. జాతీయ జట్టుకు దూరమైనా తిరిగి టీమ్‌లోకి రావాలంటే కచ్చితంగా దేశవాళీలో ఆడాల్సిందేనని టీమిండియా హెడ్‌కోచ్ రాహుల్ ద్రావిడ్ ఇదివరకే పలుమార్లు అతడికి సూచించాడు. కానీ ఇషాన్ మాత్రం ద్రావిడ్ మాటలను పెడచెవిన పెట్టాడు. ద్రావిడ్ ఎన్నిసార్లు చెప్పినా ఇషాన్ మాత్రం అసలు తనకు రంజీలతో సంబంధమే లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నాడు. ఇప్పుడు బీసీసీఐ ఆదేశాలతో ఇషాన్ తప్పనిసరిగా రంజీలు ఆడాల్సిందే.ఇక హార్దిక్ విషయానికొస్తే.. గతేడాది వన్డే వరల్డ్ కప్‌లో భాగంగా బంగ్లాదేశ్‌తో పూణె వేదికగా జరిగిన మ్యాచ్‌లో గాయపడ్డాడు. ఆ తర్వాత జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో చేరాలని పలుమార్లు సూచించినా అతడు మాత్రం బరోడాలో ట్రైన్ అవుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. వచ్చే ఐపీఎల్ సీజన్‌లో ముంబై ఇండియన్స్‌కు సారథిగా వ్యవహరిస్తున్న హార్దిక్.. మరో నెల వరకూ పూర్తిస్థాయిలో సిద్ధమయ్యేందుకు కసరత్తులు చేస్తున్నాడు. అయితే బీసీసీఐ ఆదేశాలతో అతడు కూడా దేశవాళీలో పాల్గొనాల్సిందే.




## అచ్చం దాదా మాదిరే.. అతడి ఆట కోసమే చూస్తున్నా!

టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌పై భారత మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ ప్రశంసలు కురిపించాడు. యశస్వి బ్యాటింగ్ తీరు చూస్తే తనకు సౌరవ్ గంగూలీ గుర్తుకువస్తాడని తెలిపాడు.దాదా మాదిరే ఆఫ్ సైడ్ ఆడటంలో ఈ ముంబై బ్యాటర్ దిట్ట అంటూ కొనియాడాడు.కాగా వెస్టిండీస్ గడ్డపై శతకంతో అంతర్జాతీయ క్రికెట్‌ను మొదలుపెట్టిన యశస్వి జైస్వాల్.. ఇటీవలే తొలి డబుల్ సెంచరీ బాదాడు. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ సందర్భంగా వైజాగ్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లో ద్విశతకంతో చెలరేగి.. జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించాడు.తదుపరి రాజ్‌కోట్ వేదికగా ఫిబ్రవరి 15 నుంచి మొదలుకానున్న మూడో టెస్టుకు యశస్వి జైస్వాల్ సిద్ధమవుతున్నాడు. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ స్టార్ స్పోర్ట్స్ షోలో యశస్వి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.”ఈ సిరీస్‌లో నేను ఎవరి ఆట కోసమైనా ఎదురుచూస్తున్నానంటే అది యశస్వి జైస్వాల్ మాత్రమే! ఐపీఎల్‌లో అతడు ఎలా ఆడతాడో మనమంతా చూశాం. అత్యద్భుతమైన ఆటగాడు.దాదా మాదిరే ఆఫ్ సైడ్ గేమ్ చితక్కొడతాడు. చూపగలడు.మనం ఇప్పుడు దాదా గురించి మాట్లాడుకుంటున్నట్లుగానే యశస్వి గురించి కూడా మాట్లాడుకోవడం ఖాయం. అంతర్జాతీయ క్రికెట్‌లో ద్విశతకం బాది తన సత్తా ఏమిటో యశస్వి మరోసారి నిరూపించుకున్నాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.